క్లుప్తంగా

చంద్రమౌళీశ్వరునికి పూజలు



చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆకుల వీర్రాజు

కడియం: మాధవరాయుడుపాలెంలో ఇటీవల ప్రతిష్ఠించిన భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామిని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు సంగిత వెంకటేశ్వరరావు, నాయుడు, అయినవిల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రకాశం నగర్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషనర్ ఆధ్వర్యంలో 17వ జాతీయ బాలల చిత్రలేఖనం పోటీల్లో ఎస్కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని హెచ్ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. 9వ తరగతి చదువుతున్న నూలు హేమంత్ కుమార్ టాప్‌టెన్ అవార్డు, జి.పూర్ణిమ రాజేశ్వరి బంగారు పతకం సాధించారన్నారు. ఆ విద్యార్థులకు, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు పుప్పాల బాపిరాజుకు అభినందనలు తెలిపారు.

దంత వైద్యశిబిరం




శిబిరంలో దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవాపథకంలో భాగంగా బుధవారం తొర్రేడులో దంత వైద్యశిబిరం నిర్వహించారు. తొర్రేడు సొసైటీ, సాయిరామ్ డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సొసైటీ అధ్యక్షుడు చిట్టూరి వెంకటరావు, సీఈవో కేవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. వ్యవసాయ కళాశాల లెక్చరర్లు డాక్టర్ పీఎల్ఆర్‌జే ప్రవీణ, డాక్టర్ కె.వసంతభాను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎస్.హైమజ్యోతి, డాక్టర్ కె.రవికుమార్ పాల్గొన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు తొర్రేడు సొసైటీ మందిరంలో మహిళలకు పెరటితోటల పెంపకంపై డాక్టర్ కె.రవికుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం వివిధ రకాల కూరగాయల విత్తనాల కిట్లను ఉచితంగా పంపిణీ చేస్తారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడియం: మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని గుబ్బలవారిపాలేనికి చెందిన డి.శ్రీనివాస్ (39) చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం మృతి చెందాడు. కడియం పోలీసుల వివరాల ప్రకారం.. 2018, మే 6న శ్రీనివాస్ తన భార్య జయను కత్తితో నరికి హత్య చేసిన కేసులో నిందితుడుగా ఉన్నాడు. ఈ కేసు కోర్టులో చివరి దశకు చేరింది. బుధవారం ఈ కేసులో అతడికి శిక్షపడుతుందన్న భయం ఏర్పడింది. దీంతో పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే కడియం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి రాజమహేంద్రవం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువు వరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ కన్వీనర్, కోకన్వీనర్ల నియామకం



ఆకుల శ్రీధర్



యానాపు ఏసు

రాజమహేంద్రవరం రూరల్: బీజేపీ రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ కన్వీనర్‌గా ఆకుల శ్రీధర్, కో కన్వీనర్ యానాపు ఏసును నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీధర్, యానాపు ఏసు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో రూరల్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీని విజయపథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఈ బాధ్యతలను ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

- ముస్తాబైన రామాలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు

సీటీఆర్ఐ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చైత్రమాస శుద్ధ నవమి గురువారం పునర్వసు నక్షత్రయుక్త కర్కాటక లగ్నమందు స్వామివారి కల్యాణం జరగనుంది. స్థానిక సీతంపేటలోని వందేళ్ల చరిత్ర కలిగిన సీతారామాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. జాంపేట పోలీసు క్వార్టర్స్‌లోని కోదండ రామాలయం, దేవీచౌక్‌లోని సీతారామ, లక్ష్మణ, హనుమ సమేత ఆలయంలో ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించనున్నారు. రామాలయాలతో పాటు హనుమంతుడి ఆలయాల్లో కూడా శ్రీరామనవమికి ఏర్పాట్లు చేశారు.

కడియం మండలంలో..

కడియం: మండలంలోని పలు రామాలయాల వద్ద సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పురాతనమైన వీరవరంలోని కోదండరామస్వామి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఏటా మాదిరిగానే భారీ అన్నదానం నిర్వహించనున్నారు. కడియపులంకలోని ఒడ్డుకింద రామాలయం, దుళ్లలోని ఆర్యవైశ్య రామాలయం, పాత రామాలయాల వద్ద కూడా కల్యాణాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



కృష్ణానగర్‌లో శ్రీరామనవమి ఏర్పాట్లు



విద్యుత్ కాంతుల నడుమ బొమ్మూరులోని సంతాన సీతారామాలయం

ముస్తాబైన ఆలయాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ఎలక్ట్రికల్ జిల్లాస్టోర్స్ కార్యాలయం వద్ద ఉన్న సంతాన సీతారామాలయంలో గురువారం ఉదయం 12.14 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, సంతాన సీతారామాలయ కమిటీ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతుంది.

ఆల్కాట్‌తోటలో..

ఆల్కాట్‌తోటలోని రైల్వేస్టేషన్ ఎదురుగా గుడ్లవారి వీధిలో శ్రీపీఠం మఠాధిపతులు పరిపూర్ణానంద స్వామితో ప్రతిష్ఠించబడిన రామాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందని ఆలయ ధర్మకర్త ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, భక్త సమాజం తెలిపారు. రూరల్ మండలంలోని గ్రామాల్లోనూ, నగరపాలకసంస్థ పరిధిలోని రూరల్ డివిజన్‌లో గల రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి.

విద్యార్థులు అన్నింటా ముందుండాలి

ధవళేశ్వరం: విద్యార్థులు అన్నింటా ముందుండాలని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. బుధవారం ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్లో జరిగిన డ్రీమ్స్ స్పోర్ట్స్ మీట్–2023 బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ వాతావరణంలో కార్పొరేట్‌కు ధీటుగా, సాధారణ ఫీజులకే విద్యను అందిస్తూ డ్రీమ్స్ అన్నింటా అగ్రస్థానానికి చేరుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం డ్రీమ్స్ స్పోర్ట్స్ మీట్–2023లో రన్నింగ్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖోలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ అవార్డులు అందజేశారు. నవోదయలో స్థానం సాధించిన డ్రీమ్స్ స్కూల్ 8వ తరగతి విద్యార్థిని సముద్రాల సాయి సుప్రియను అభినందించారు. కరస్పాండెంట్ ఎ.రమేష్, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.భ్రమరాంబ, హైస్కూల్ ప్రిన్సిపాల్ వి.సంధ్యాకుమారి, ప్రీప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ జి.విమలారోజి, వేమగిరి ప్రీప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ కె.లలితాదేవి పాల్గొన్నారు.



బహుమతి ప్రదానం చేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

కడియం: స్థిరమైన వ్యవసాయ పద్ధతులు అనే అంశంపై సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆవరణలో బుధవారం నర్సరీ రైతులకు శిక్షణ నిర్వహించారు. జన్ సాహస్, సేఫ్‌వే సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సేఫ్‌వే ప్రాజెక్ట్ మేనేజర్ కె.బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కడియపులంకలో పరిసరాల పరిశుభ్రత, ఇంటింటా పారిశుధ్యం అనే అంశాలపై దశల వారీగా అనేక అవగాహన సదస్సులు ఇప్పటికే నిర్వహించామన్నారు. చివరిగా నర్సరీ రైతులకు స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, వర్మీ కంపోస్టు అనే అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ వీఎస్ డానియల్ మాట్లాడుతూ జన్ సాహస్, సేఫ్ వే సంస్థల సహకారంతో కడియపులంకలో పూర్తిస్థాయిలో పారిశుధ్యం మీద మూడు నెలలుగా పనిచేస్తున్నామని, దానిలో భాగంగా కడియపులంక గ్రామంలో 60 సిమెంట్ చెత్త కుండీలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కో ఆర్డినేటర్ దుర్గాప్రసాద్ పట్నాయక్, సేఫ్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కె.బాల సుబ్రమణ్యం, జన్ సాహస్ సంస్థ స్టేట్ కో ఆర్డనేటర్ వీఎస్ డానియల్, రిసోర్స్ పర్సన్ డాక్టర్ సీవీ సోమయాజులు, పంచాయతీ కార్యదర్శి సాయి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

జగన్ పాలనలో పేదల సంక్షేమం



సమావేశంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

- ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా ఆసరా వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అంటే పేదల ప్రభుత్వమని, సీఎం జగన్ సంక్షేమ పాలనతో సమసమాజాభివృద్ధికి బాటలు వేస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని ఎస్కేవీటీ స్కూల్లో 3, 4, 8 డివిజన్ల మహిళలు, లాలాచెరువు హైస్కూల్ వద్ద 1, 2, 50 డివిజన్ల మహిళలతో బుధవారం వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ చంద్రబాబు పాలన దోచుకో, దాచుకో విధానమైతే, జగన్ పాలన పేదలకు పంచాలన్న విధానమన్నారు. చంద్రబాబుది స్వార్థం.. జగన్‌ది త్యాగం అన్నారు. నగరంలో వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు ఉంటే అభివృద్ధి మరింత శరవేగంగా పరుగులు పెడుతుందన్నారు. రానున్న 2024 ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత డ్వాక్రా మహిళలదేనన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణం డిసెంబరు నెలాఖరుకు పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ల ఇన్‌చార్జులు గుత్తుల మురళీధర్, బొంత శ్రీహరి, ముప్పన ప్రభాకరరావు, మానే దొరబాబు, బళ్ల సత్యవతి, పార్టీ నాయకులు బర్రే కొండబాబు, పీతా రామకృష్ణ, పోలు విజయలక్ష్మి, కొత్తా విజయ రాజ్యలక్ష్మి, రాయుడు గణేష్, మార్గాని సురేష్, నక్కా నగేష్ పాల్గొన్నారు.

భోజన విరామ సమయంలో నిరసన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 5వ పే కమిషన్ సిఫారసుల మేరకు కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల పింఛన్ సదుపాయంలో మెరుగుదల చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు సతీష్ ప్రయాగ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్లకు సంఘీభావంగా నిరసన ప్రదర్శన చేశారు. సతీష్ ప్రయాగ మాట్లాడుతూ కుటుంబ పింఛన్‌ను 30 శాతం పెంచాలని, ఇతర సదుపాయాల మెరుగుదలను సిఫారసు చేస్తూ ఎల్ఐసీ బోర్డు మూడున్నరేళ్ల కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయకుండా మూడేళ్లుగా తాత్సారం చేస్తోందన్నారు. పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ మూర్తి, రఘునాథరావు, రాజమండ్రి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గుబ్బల రాంబాబు, ఎం.కోదండరాం, బెనర్జీ, శిరీష పాల్గొన్నారు.



ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పూర్తిస్థాయిలో గోదావరి నీరందించాలి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కార్పొరేషన్ అధికారులతో సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరానికి ఆనుకుని ఉన్న లాలాచెరువు పంచాయతీ హౌసింగ్ బోర్డు ప్రజలకు గోదావరి నీటిని పూర్తిస్థాయిలో అందించేలా చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రాజానగరం నియోజకవర్గానికి సంబంధించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి బుధవారం రాజమహేంద్రవరం కార్పొరేషన్ అధికారులతో సమావేశమయ్యారు. రాజానగరం నియోజకవర్గ హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రజలకు గోదావరి నీరు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో రూ.5.60 కోట్లతో డ్రైనేజీల నిర్మాణాలు చేపడుతున్నామని, వాటి పురోగతిపై చర్చించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ పాండురంగారావు, డీఈ చంద్రశేఖరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్ట్ డీఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

దేవుని మహిమతో ప్రజలకు సేవ

సీటీఆర్ఐ: దేవుని మహిమతో ఎంపీగా గెలిచి ప్రజలకు సేవ చేస్తున్నానని ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక క్వారీ మార్కెట్ సమీపంలో జరుగుతున్న బైబిల్ మిషన్ 56వ మహాసభలకు బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో క్రైస్తవులకు బరియల్ గ్రౌండ్ తీసుకువచ్చామని, భవిష్యత్తులో క్రైస్తవుల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఎన్.విజయరాజు మాట్లాడుతూ బైబిల్ మిషన్‌కు నిత్యం సహాయ సహకారాలు అందించే ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు అభినందనలు తెలియజేసి, దైవాశీర్వాదాలను అందజేశారు. గురువారం జరిగే ముగింపు కార్యక్రమానికి హోంమంత్రి తానేటి వనిత హాజరవుతారన్నారు. అనంతరం సుందర శామ్యూల్, డి.షెకీనాబాబు, ఎస్‌జే ఆనంద్ పాల్ వాక్యోపదేశాలను అందజేశారు. ఎస్.సిమ్యోన్ సుదర్శన్, ఎన్.విలియం బెంటిక్, ఎస్.ఉషారాణి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ సర్పంచ్ కె.సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సీతనబోయిన సాయిరామ్ పాల్గొన్నారు.



బైబిల్ మిషన్ మహాసభల్లో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

సీటీఆర్ఐ: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాలకు ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పార్టీ నగర కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. సుమారు 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, పార్టీ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న టీడీపీ నాయకులు

5న చలో ఢిల్లీ

కడియం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనుసరిస్తున్న కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బేబీరాణి అన్నారు. ఈ మేరకు కడియంలో బుధవారం అంగన్‌వాడీలతో కలసి చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.పదివేలు ఇవ్వాలని, అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి అనే 14 రకాల డిమాండ్లతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

4న జిల్లా ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లా ఆవిర్భవించి ఏప్రిల్ 4వ తేదీకి ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో ఆరోజు కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏడాది ప్రగతిపై వేడుకలు, తదుపరి డీడీఆర్సీ సమావేశం, అసైన్‌మెంట్ కమిటీ మీటింగ్ ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా అధికారులు తమశాఖల పరంగా చేపట్టి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. రబీ సీజన్లో రైతులకు అందించే గన్నీబ్యాగుల వివరాలు తెలిపేందుకు రూపొందించిన యాప్‌ను ఏప్రిల్ 4న ఆవిష్కరిస్తామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీహెచ్ శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 4న జరిగే ఏర్పాట్ల అంశంపై ఏప్రిల్ 3వ తేదీన ప్రీరివ్యూ మీటింగ్‌ను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సమీక్షిస్తారన్నారు. కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని నివేదికల రూపంలో అందించాలని అధికారులకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్, చిత్రంలో కమిషనర్ దినేష్ కుమార్

రాహుల్‌గాంధీపై బీజేపీ ప్రభుత్వ తీరు దారుణం

రాజమహేంద్రవరం సిటీ: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్ గాంధీపై కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందని, దీన్ని నిరసిస్తూ ఏప్రిల్ నెలాఖరు వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానాలను నిరసిస్తూ స్థానిక కృష్ణనగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ దేశం కోసం ఆస్తులు, అధికారాన్ని త్యజించి ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబంపై ప్రధాని నరేంద్ర మోదీ కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. కాగా.. స్థానిక 45వ డివిజన్‌కు చెందిన పొన్నమండ బాబ్జీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు బాలేపల్లి మురళీధర్, బోడ వెంకట్, మార్టిన్ లూథర్ కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు.

నేడు మార్గాని ఎస్టేట్స్‌లో సీతారామ కల్యాణం

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్‌లో ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్‌విప్ మార్గాని భరత్ రామ్ దంపతుల ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రజలు సకుటుంబ సమేతంగా విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పార్టీ కార్యాలయం ప్రకటనలో తెలిపింది.

రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ బుధవారం ప్రకటించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కోర్లమ్మపేట, తుమ్మలోవ, సాంబశివరావుపేట, ఆర్యాపురం, దేవీచౌక్, ఏఎస్ఆర్ సెంటర్‌లో సరఫరా ఉండదన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వేమగిరి, కడియం, కడియపు సావరం, జేగురుపాడు గ్రామాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

జర్నలిజంలో డిప్లమో కోర్సుకు రేపు నోటిఫికేషన్

సీటీఆర్ఐ: ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ జర్నలిస్టుల వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ప్రారంభించతలపెట్టిన జర్నలిజంలో డిప్లమో కోర్సుకు నోటిఫికేషన్ విడుదల కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ సెక్రటరీ మామిడిపల్లి బాలగంగాధర తిలక్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రకాశం నగర్: బాలల భవితకు పోషకాహారం ఎంతో ముఖ్యమని, పోషకాహారం తీసుకుంటేనే బాగా చదవగలుగుతారని బాలల హక్కుల కమిటీ చైర్‌పర్సన్ పి.సూర్యప్రభావతి అన్నారు. బుధవారం స్థానిక నెహ్రూ నగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులకు పోషకాహార పోషణ, పక్వాడాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ పిల్లలకు మిల్లెట్స్, సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించారు. రాగిజావ వల్ల రక్తహీనత తగ్గడంతో పాటు ఎన్నో పోషక విలువలు అందుతాయన్నారు. రాష్ట్ర బాలల హక్కుల కమిటీ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులందరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర సీడీపీఓ వెంకట నరసమ్మ, నెహ్రూనగర్ మున్సిపల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ ప్రారంభం



రిబ్బన్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 30వ డివిజన్‌లో నగర పాలక సంస్థ నిధులతో ఆధునీకరించిన సులభ్ కాంప్లెక్స్‌ను వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి కాటం ప్రియాంక, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ చైర్మన్ కాటం రజనీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ప్రకాశం నగర్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన గాంధీపురం –2 సుంకర భాస్కరరావు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులు చల్లా లాస్యప్రియ, ఎం.ప్రణవి, బి.శ్రీజ, బి.రుత్విక్ సాయి, ఆర్.సత్యసాయిలక్ష్మి, యు.ప్రశాంత్‌ను బుధవారం హెచ్ఎం రొబ్బి సన్యాసిరావు అభినందించారు. స్పోర్ట్స్ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్, టీచర్ రామకాంతి తదితరులు సర్టిఫికెట్, జ్ఞాపికలను ఆ విద్యార్థులను అందజేశారు.

సినిమాలు



శ్యామల	:	బలగం
సూర్యమినీ	:	దాస్‌కాధమ్కీ
సూర్యప్యాలెస్	:	దసరా
స్వామి	:	దాస్‌కా ధమ్కీ
అశోక	:	దసరా
శివజ్యోతి	:	రంగమార్తాండ
అనుశ్రీ	:	దసరా
రాజా	:	దసరా
ఊర్వశి	:	పరారీ
రంభ	:	షజామ్
గీతాఅప్సర	:	దసరా
నామవరం		
వీఎస్ మహల్	:	దసరా
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	దసరా